# కథ

"చిన్నిచిన్ని ఆశ... ముద్దు ముద్దు ఆశ..." దూరంగా మైక్‌లోంచి పాట వినిపిస్తోంది. ఆశ ఎంత చిన్నదైనా మనిషిని మురిపిస్తుంది. మత్తులో ముంచేస్తుంది. ఎన్నో ఊహలలో ఊయలలూగిస్తుంది. ఆశ లేని జీవితం వాసన లేని పువ్వు.

ఆ ఆశే సూర్యాన్ని అక్కడికి రప్పించింది. అది ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్. గుమ్మం దగ్గర నిలబడి చాలా సేపు ఎదురు చూశాడు. తనని ఎవరైనా పలకరిస్తారేమోనని, అలాంటి ఆలోచన ఎవరికీ లేదని గ్రహించడానికి చాలాసేపు పట్టింది. "మీ సేవయే మా కర్తవ్యం" అని రాసి ఉన్న బోర్డును చూసి నవ్వుకున్నాడు.

మెట్లు దిగి అదే కాంపౌండులో తచ్చాడుతూ అందరినీ అమాయకంగా పరిశీలిస్తున్నాడు. కొత్త రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వాళ్ళు, రెన్యువల్ చేయించుకునే వాళ్ళు అంతా ఎవరి గొడవలో వాళ్ళున్నారు. అక్కడే ఓ చెట్టు నీడలో కూర్చున్నాడు.

సూర్యం తన పేరు నమోదు చేయించుకుని పదేళ్ళయ్యింది. కానీ, ఒక్కసారీ పిలుపు రాలేదు. తండ్రి భారత దేశ వెన్నెముకలో ఒక పూస. ప్రభుత్వం అతన్ని ముద్దుగా "సన్నకారు రైతు" అని పేరు పెట్టి పిలుస్తుంది. దేశమంటే మట్టికాదోయ్ అని చెప్పినా వినకుండా ఆ మట్టినే పట్టుకు వేలాడతాడు. తిండి కలిగితే కండ కలుగుతుందో లేదో అతనికి తెలియదు. కానీ తిండి కలిగితే కడుపు మండదని మాత్రం బాగా తెలిసిన వాడు. అందుకే ప్రతి ఏటా విత్తనాలు చల్లుతాడు. నింగిలోకి చూపుల గాలం వేస్తాడు. లేని మేఘాల్ని పట్టి తన నేలపై కురిపించాలని. దివిజ గంగ భువికి దింపాలని ప్రయత్నించే అపర భగీరథుడు. మొదట్లో రెండెకరాలుగా ఉండే భూమి క్రమక్రమంగా కరిగిపోయి కూతురి పెళ్ళితో ఎకరంగా మిగిలింది.

"ఓరీ సూరీడా ! పట్నంలో ఆఫీసు కాడ నీ పేరు రాయించుకున్నావు గందా ! ఓ పాలి పోయి అడగరాదూ... నౌకరీ ఏటయినా ఇత్తారేమో!" అన్న తండ్రి మాట కొట్టేయలేక "సరే!" అన్నాడు. తిండి గింజల కోసమని గాదెలో ఉంచుకున్న పుట్టెడు చోళ్ళు అమ్మి, డబ్బు సూర్యం చేతిలో పెట్టాడు.

పల్లెటూళ్ళు దేశానికి పట్టుగొమ్మలు ఇది ఎంత వరకూ నిజమోగానీ, పల్లెటూళ్ళు పళ్ళూడిపోయిన బోసినోళ్ళలా వెలితిగా ఉన్నాయి. పల్లెటూళ్ళు ప్రభుత్వాన్ని కట్టుకున్న పెళ్ళాలు, పట్నాలు, మాత్రం ప్రియురాళ్ళలా వెలిగిపోతున్నాయి. సూర్యం వాళ్ళ ఊరి నుంచి పట్నం పోవాలంటే పది కిలో మీటర్ల దూరంలో బస్సు రోడ్డున్న మరో ఊరు వెళ్ళాలి.

సూర్యం ఉదయాన్నే బయలుదేరి గుట్టలు, పుట్టలు, తుప్పలు, బట్టీలు, గట్లు దాటి "బస్సు రోడ్డు" చేరేసరికి ఉదయం ఎనిమిది గంటలయ్యింది. ఆ రోడ్డులో ఒకే ఒక బస్సు తిరుగుతుండి. అది పట్న నుంచి పల్లెకు రెండుసార్లు తిరగాలి.

సూర్యం బస్సు రోడ్డుకి చేరి ముప్పావు గంట అయ్యింది. బస్సు జాడ లేదు. వెళ్ళిపోయిందా ? లేదా ? ఆలోచనల్తో సతమతమవుతూ రోడ్డు ప్రక్కనే పొలం దున్నుతున్న రైతుని అడిగాడు.

"రాలేదు... అది వస్తాదో, రాదో తెలవదు" అన్నాడు.

పట్నం నడిచి పోదామా ? అనుకుంటే బస్సుకే ఆరు గంటల పైన ప్రయాణం. నడిచి వెళ్ళే దూరం కాదు. ఆలోచిస్తుండగానే దూరంగా బస్సు హారన్ వినిపించింది. "హమ్మయ్యా... బస్ వస్తోంది" అనుకున్నాడు. కానీ అంతలోనే అనుమానం. అక్కడ ఆగుతుందా ? ప్రైవేటు బస్సు కదా ! ఆపుతాడు. ఆ స్టేజీలో ఉన్నది తను ఒక్కడే కదా ! మరి ఆగుతుందా ? అతను ఆలోచిస్తుండగానే బస్ రావడం, చెయ్యి అడ్డు పెట్టినా ఆగకుండా ముందుకి పోవడం జరిగింది. కానీ, ఒక గొర్రెల మంద రోడ్డుకి అడ్డం రావడంతో బస్ స్లో అయింది. సూర్యం పరిగెత్తి లోపలికి ఎక్కడం మరో వ్యక్తి సూర్యాన్ని తప్పించుకుని దిగడం జరిగిపోయింది. ఎలాగో బస్సులో కూరుకున్నాడు.

బస్సు పట్నంలోని స్టాండుకి చేరేసరికి మధ్యాహ్నం మూడయ్యింది. ఆఫీసులో తొందరగా పని ముగించుకుని మళ్ళీ అదే బస్సు ఎక్కొచ్చు అనుకుంటూ గబగబా మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ ఆఫీసు కొచ్చిపడ్డాడు.

కానీ ఇక్కడ తన సంగతి ఎవరికి చెప్పాలి ? ఎవర్ని అడగాలి. ఎరువుల గోతాంతో చేసిన చేతి సంచీ పట్టుకుని చెట్టు క్రింద నిలబడ్డాడు.

"ఏయ్... ఇక్కడ నిలబడితే పనులు జరగవు. ఏం పని మీద వచ్చావు?" పొద్దుట్నించీ ఒక్క కేసూ తగలని బ్రోకరు సూర్యం పక్కగా నిలబడి అడిగాడు.

సూర్యం తను వచ్చిన పని చెప్పాడు.

"సరే !... నీకు పని జరగాలంటే ఒక మనిషిని చూపిస్తా ! అతనే అన్నీ చేసి పెడతాడు. చూసినందుకు నాకు పది రూపాయలు ఇవ్వాలి" అన్నాడు.

సూర్యం అయిదు ఇస్తానన్నాడు. బ్రోకర్ సరే, అని అతనిచ్చిన డబ్బులు జేబులో పెట్టుకున్నాడు.

"లోపల బంగారయ్య అని ఒకడున్నాడు. బ్రోకర్ సరే, అని అతనిచ్చిన డబ్బులు జేబులో పెట్టుకున్నాడు.

"లోపల బంగారయ్య అని ఒకడున్నాడు. ఆడి అసలు పేరు ముసలయ్య. మెడలో పులిగోరు పతకం, లాల్చీకి బంగారపు బొత్తాం, వేళ్ళకి బంగారపు ఉంగరాలు ఇవన్నీ చూసి ఆఫీసు వాళ్ళంతా బంగారయ్య అని పేరు పెట్టారు. ఆడ్నిప్పుడు ముసలయ్య అని పిలిస్తే పలకడు. ఆడిది మా ఊరేలే ! ఎవడిన్ని డిగ్రీలు చదివినా ఆడి వానాకాలం చదువు ముందు తల దించెయ్యాల్సిందే !" అని చెప్పి లోపలికి తీసుకెళ్ళాడు.

బంగారయ్య చుట్టూ జనం ఉన్నారు. బ్రోకర్ని చూడగానే చెయ్యూపాడు. జనం తప్పుకుని దారిచ్చారు. దగ్గరికి రాగానే "ఏంటి చెప్పు?" సూర్యాన్ని అందరూ వి.ఐ.పి.ని చూసినట్లు చూస్తూండగా బంగారయ్య అడిగాడు.

సూర్యం మహా సంబరపడిపోతూ వచ్చిన పని తడబాటుతో చెప్పాడు. బంగారయ్య సూర్యాన్ని పరిశీలనగా చూసి—

"పిలుపు రాలేదంటావా? బాగుందయ్యా.. అంత వేగంగా పిలుపులు వస్తాయా? పెళ్ళి పిలుపు కెంత తంతు వుందో దీనికే అంతే! ముందు పెళ్ళి చూపులు, తర్వాత నిశ్చయతాంబూలాలు, కట్నకానుకలు అన్నీ అయ్యాక కార్డులు అచ్చవుతాయి. ఇదీ అలాగే! ఇప్పుడు మనకి చూపులు అయిపోయాయి. కాబట్టి కట్నకానుకలు మాట్లాడుకుందాం. ఐదుగంటలవరకూ బయటబెంచీ మీద కూచో! అన్నాడు. చుట్టూ ఉన్న జనం నవ్వారు.

అయిదు గంటల వరకూ బయట కూచున్నాడు జనం పలచబడ్డారు. సూర్యం మెల్లిగా లోపలకెళ్ళాడు.

బంగారయ్య సూర్యాన్ని చూసి, "అ రావయ్యా.. ఇదిగో ఈ ఫ్లాస్క్ తీసుకెళ్ళి టీ పట్రా" అన్నాడు.


సూర్యం ఫ్లాస్క్ అందుకుని ఇంకా అక్కడే నిలబడటం చూసి "వెళ్లు, వెళ్ళు, తొందరగా తీసుకురా!" అనడంతో బయటకి పరిగెత్తాడు. టీ తీసుకొచ్చి బంగారయ్యకిచ్చాడు. "బయట కూచో!" అని బంగారయ్య చెప్పడంతో బయటకొచ్చి కూచున్నాడు.

జనం తగ్గిపోయారు కాబట్టి తన పని చూస్తాడనుకున్నాడు సూర్యం. కానీ, క్రమంగా స్కూటర్లు, మోటారు సైకిళ్ళు, రావటం మొదలు పెట్టాయి. రెండు మూడు కార్లుకూడా వచ్చాయి.

తన పక్కనే ఒక ముసలతను కూర్చున్నాడు. సూర్యం అతన్ని అడిగాడు. 'ఆఫీసు 5 గంటల తర్వాత కూడా పని చేస్తుందా?"

అతను సూర్యాన్ని అప్పుడే అడవి లోంచి వచ్చిన ఓ వింత జంతువుని చూసినట్లు చూసి చిన్నగా నవ్వి, ఆఫీసు అయిదు గంటల తర్వాతే పని చేస్తుంది. ఇప్పుడే పనులు జరుగుతాయి. ఈ గంటకోసమే సాయంత్రం వరకూ ఆఫీసులో ఉంటారు".

"మరింత సేపూ ఏం చేస్తారు" అడిగాడు సూర్యం.




# పి.అప్పారావు మృగతృష్ణ

ఆడుకుంటారు. నాటకాల డైలాగులు చెప్తారు. పనికిరాని చెత్త కాగితాలు రాస్తారు. అమాయకుల్తో ఆడుకుంటారు. అన్నాడు ఆ ముసలతను.

"ఏయ్ ఇలారా—!" తలుపు దగ్గర నిలబడి బంగారయ్య పిలవడంతో సూర్యం పరిగెట్టాడు.

"ఓ కింగ్ సైజ్ ఫిల్టర్ సిగరెట్ పెట్టె పట్రా" అని విసురుగా లోపలకెళ్ళి పోయాడు. అందుతున్న స్వర్గం చేజారిపోతుందేమోనన్న భయంతో ఆలస్యం చెయ్యకుండా పరిగెట్టుకెళ్ళి సిగరెట్ పెట్టె తెచ్చిచ్చాడు.

స్కూటర్ల మీద కార్ల మీద మనుషులు ఎంత వేగంగా వచ్చారో అంతవేగంగా పనులుపూర్తి చేసుకుని వెళ్ళిపోతున్నారు. సూర్యానికి ఆకలన్పించింది. తల్లి కట్టిచ్చిన రెండు జొన్న రొట్టెలు సంచీలో ఉన్నాయి. తీసి తిందామనిపించింది. కానీ అక్కడ అంతమంది జనం వస్తూ,పోతూ ఉన్నారు. చూస్తే బాగుండదమో అనుకున్నాడు. ఆకలేస్తే కడుపునింపుకోడాని కూడా సంకోచించే తత్వం మనకి ఈ నాగరికతే నేర్పించేమో!

సాయంత్రం 6.30 అయింది. బంగారయ్య కనిపించలేదు. గుమ్మం దగ్గర చప్పుడయిన ప్రతీసారీ చూస్తున్నాడు ఆశగా. వచ్చిపోయే జనం తప్ప బంగారయ్య జాడ కన్పించలేదు.

ఆఫీసర్ సిబ్బందితో కలిసి బయటకు వచ్చారు. మూల ఒరిగి కూర్చున్న సూర్యాన్ని చూసి—

"రేయ్! ఎవర్నువ్" గద్దించాడాయన.

సూర్యం భయంతో వణికిపోయాడు. నేను... నేను.. బంగారయ్య గారి కోసం ... అంటూ అతను వాక్యం పూర్తి చేయకుండానే—

"ఒరే.. బంగారం..! నీ కోసం ఎవడో కూర్చున్నాడు. చూడు!" అని పిలిచాడాయన.

బంగారయ్య వచ్చి సూర్యాన్ని పరీక్షగా చూస్తూ— 'నువ్వా?' ఉండు! తాళావేసి వస్తాను" అని చెప్పి, తాళం వేసుకొ చ్చి ఆఫీసర్ గారి చేతిలో పెట్టాడు. ఆయన జీపు ఎక్కాక, దుమ్ము రేపుకుంటూ గేటుదాటింది జీపు.

పార్కింగ్‌లో ఉన్న మోటారుసైకిల్ తీసి స్టార్ట్ చేశాడు బంగారయ్య, సూర్యం పరిగెత్తుకుంటూ దగ్గరగా వెళ్ళాడు. పక్కనేఉన్న త్రీస్టార్ హోటల్ చూపించి అక్కడికి రమ్మన్నాడు. సూర్యం బండి వెనకే పరిగెత్తాడు.

యజమాని వెనకేనడిచే పెంపుడు కుక్కలా బంగారయ్య వెనకే సూర్యం నడుస్తూ ఆ హోటల్లోకి అడుగుపెట్టాడు. కుర్చీల్లో కూర్చున్నాక, పరిశీలనగా చూశాడు సూర్యం. మసకవెల్తురు. ఎవరూ స్పష్టంగా కనపించడంలేదు. అలాంటి హోటల్లో అడుగుపెట్టడం సూర్యానికి అదే మొదటిసారి.

బేరర్ రాగానే "రెండు చికెన్ ఫ్రై" అన్నాడు బంగారయ్య.

"సార్! నేను తినను. ఒకటే చెప్పండి" అంటూ తన ఒళ్లో ఉన్న జొన్న రెట్టెల సంపొదివి పట్టుకున్నాడు.

"ఏం? నువ్వు నాన్ విజిటేరియన్ తినవా?" అడిగాడు బంగారయ్య తీరిగ్గా కుర్చీ వెనక్కి వాలుతూ.

"లేదు సార్! నేనేం తినను." అన్నాడు సూర్యం.

"సరే! ఒక చికెన్‌ఫ్రై, ఒక బిరియానీ పట్రా" అన్నాడు బేరర్‌తో బంగారయ్య. బేరర్ వెళ్లాడు.

బేరర్ పదార్థాలు తెచ్చే వరకూ పెరిగిపోతున్న ధరల గురించివాపోయాడు బంగారయ్య. "అవును సార్!" "అంతేనండి!" నిజమేనండి అంటూ తన వినమ్రత వ్యక్తం చేశాడు సూర్యం.

పళ్లాలు బల్లమీదకి రావడంతో వాటి మీదకి లంఘించి "ఇప్పుడు చెప్పవయ్య నీ కథ" అన్నాడు.

సూర్యం తన జేబులోంచి ఎంప్లాయిమెంట్ కార్డు తీసి చూపించాడు. తన బాధంతా సాధ్యమైనంత విన్నవించాడు.

"సరే .. సరే ! అర్థమయింది. మా ఆఫీసర్‌గారితో చెప్పి కార్డు పంపించే ఏర్పాటు చేస్తాను. ఐదువేలు ఖర్చవుతుంది. ఇచ్చుకోగలవా?" అన్నాడు.

"మా నాన్నగారితో మాటాడి చెప్తాసార్" అన్నాడు సూర్యం.

"చూస్కో నీ ఇష్టం. ఇదే మంచి అవకాశం. సెంట్రల్ గవర్నమెంటు ఆఫీసు నుంచి పదిపోస్టులకి అభ్యర్థులను పంపమని వచ్చింది. నిన్నో కేండేటుగా పంపుతాం! అక్కడ ఆఫీసర్‌గారు

నిన్ను అపాయింట్ చేయడానికి, బోర్డు మెంబర్లతో, ఇక్కడ, అక్కడ మొత్తం అన్నీ కలిపి యాభై వేలవుతాయి. ఇది మంచి సమయం ఆలోచించుకో! అన్నాడు బంగారయ్య.

'అలాగే సార్! నేను మానాన్న గారితో రెండు రోజుల్లో వస్తాను" సూర్యం ఆశతో వచ్చిన ఉత్సాహంతో అన్నాడు.

"ఆఁ... మర్చిపోయాను. నువ్వు నీ చదువుతో సంబంధం లేకుండా ఎలాంటి ఉద్యోగమైనా సరే వెళ్లేందుకు సిద్ధమేనని రాసిచ్చి, నీ కార్డుని డమ్మీ కార్డుగా మార్చుకోవాలి" చెప్పాడు బంగారయ్య.

"అలాగేసార్" వినయంగా అన్నాడు సూర్యం.

బేరర్ బిల్లు తెచ్చాడు. సూర్యం చేతిలో ఆ బిల్లు పెట్టాడు. బంగారయ్య.

సూర్యం ఇబ్బందిగా మొహం పెట్టాడు. ఎదుటి వాడి భావాలు బాధలు కనిపించనీయడం లేదు అక్కడి మసక వెలుతురు. "సార్ నా దగ్గర నలభై రూపాయలున్నాయి. బస్సుక ఇరవై ఉండాలి. ఒక ఇరవై ఇచ్చుకోగలను" అని చెప్పి, బిల్లు ఇరవై కాగితం బంగారయ్య చేతిలో పెట్టాడు సూర్యం. ఆ ఇరవై తీసుకుని మిగతా డబ్బువేసి బిల్లు చెల్లించాడు బంగారయ్య.

ఇద్దరూ బయటకొచ్చారు. "ఆఫీసర్‌గారితో నీ సంగతి చెబుతా లేవయ్యా!" అని చెప్పి బండి స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు బంగారయ్య.

ఇంతదాకా మనసుల్లో ఆశ మెరుస్తూ ఉండటంతో కాసేపు ఆకలి వెనక్కి తగ్గింది. ఆ ఆశ లోపలి పొరల్లో దాక్కోడంతో, మళ్ళీ ఆకలి 'నేనున్నా'నంటూ గట్టిగా అరుస్తోంది.

అక్కడికి కొద్దిదూరంలో ఓ బోరింగ్‌పంపు కనబడ్డది. గబగబా అక్కడికి చేరి, సంచిలోంచి జొన్న రొట్టెలు తీసి నిల్చొనే తినేసి, ఎవరో నీళ్ళు కొట్టుకోవడానికి వస్తే, నీళ్ళు కొట్టించుకుని తాగి, "హమ్మయ్యా!" అనుకున్నాడు.

బస్టాండుకి పోయి ఈ రాత్రికి అక్కడే గడిపి పొద్దుటే ఊరు వెళ్ళొచ్చు అనుకున్నాడు. సూర్యం రోడ్డు మీద నడుస్తూ ఉంటే దారిలో ఓ లారీని ఒక రిక్షాలాగే అతను, క్లీనరు కలిసి తోస్తున్నారు. "ఓయ్ బాబూ! ఓ చెయ్యి వెయ్యి!" అడిగాడు క్లీనర్. "సరే!" అని తొయ్యగా, తొయ్యగా లారీ స్టార్టయింది.

"ఈ లారీ ఎందాకా పోతుంది" డ్రైవర్ని అడిగాడు సూర్యం.

"చింతపల్లికి కర్రలు తెచ్చేందుకు!" చెప్పాడు డ్రైవర్. "నేనూ ఆవేపే వస్తాను"! అన్నాడు సూర్యం. క్లీనర్ డోరు తీసాడు సూర్యం లారీ ఎక్కాడు. సూర్యం ఎంతో సంబరపడ్డాడు, రాత్రికి బస్టాండులో ఉండి, ఇంట్లో వాళ్ళని గాభరా పెట్టే అవసరం తప్పినందుకు.

లారీ తను దిగవలసిన రోడ్ పాయింట్ దగ్గరకి రాగానే ఆపమని దిగాడు. అప్పుడు తెల్లవారు జాము మూడు గంటలయింది. పురుగు, పుట్ర చీకట్లో కుట్టొచ్చు. అంతేకాదు ఆ మధ్య ఎలుగు బంట్లు కూడా తిరుగుతున్నాయని చెప్పారు.

ప్రయాణీకుడు: చిల్లర ఇవ్వలేదండీ
కండక్టర్: నాకు గుర్తుంది లేవయ్యా ... మరోసారి వచ్చినప్పుడు ఇస్తాలే ...
ప్రయాణీకుడు: ఆఁ !!

రమేష్, చిలకలూరిపేట



కాస్త వెలుతురు వచ్చేవరకూ ఓ చెట్టు కింద కునుకుపాట్లు పడి, వెలుగు రావడంతో తూలుతూ ఊరి దారి పట్టాడు సూర్యం.

★ ★ ★

"అంత డబ్బు మనకాడ యాడిదిరా? మన మెట్టాసరుదుకోగలం... అంటూనే ఆలోచించి సరే... మునిసీబుగార్ని అడుగుదాం! అన్నాడు తండ్రి సంగతంతా విని.

ఎకరా భూమి తాకట్టు మీద పదిహేను వేలు ఇచ్చాడు మునసబు. ఇంక మిగతా సొమ్ము ఎలా? మళ్ళీ ఆలోచన.

"ఇవిగో పట్టెడ మూడు తులాలుంటాది, ఈ నాగులు రెండూ కలిపి అమ్మండి!" అంది అమ్మ నిండు మనసుతో. వస్తువులు అమ్మ నిండు మనసుతో ఇచ్చింది. వెలితిగా ఉన్న అమ్మ మెడ చూసి నాన్న మనసు బాధగా మూలిగింది. కొడుక్కి ఉద్యోగం వస్తుందన్న ఆశ మూలిగే మనసుని ఊరడించింది.

బంగారం, డబ్బుతో తిన్నగా ఎంప్లాయిమెంట్ ఆఫీసుకి చేరారు తండ్రీకొడుకులు. వాళ్ళని చూసి బంగారయ్య ముందు మొహం చిట్లించినా, విషయం తెలుసుకున్న తరువాత ఏడుకొండల వాడిలా వెలిగిపోయాడు. మధ్యాహ్నం మూడు నక్షత్రాల హోటల్లో భోజనం ఏర్పాటు చేశాడు. సాయంత్రం తిన్నగా ఆఫీసర్‌గారింటికి తీసుకెళ్లాడు.

ఆ ఇంటిని చూస్తూనే తండ్రీ కొడుకులిద్దరికీ మతిపోయింది. సాధ్యమైనంత స్వర్గాన్ని భూమ్మీదికి దింపే ప్రయత్నం జరిగిందనిపించేలా వెలిగిపోతోంది. మొజాయిక్ ఫ్లోరింగ్ మొహం చూసుకునేలా ఉంది.

అతిథి మర్యాదలు గొప్పగా జరిగాయి. "బాబుగారూ! మా కాడ పదేను వేలున్నాయి. బంగారం ఉంది. అమ్మేసి సొమ్ము చేద్దామంటే బంగారయ్యగారు మమ్మల్ని కదల్నీ లేదు. భూమి తాకట్టు పెట్టి తెచ్చాం సొమ్ము. మరి మిగతా సొమ్ము ఊళ్ళోకెళ్ళి భూమి అమ్మేసి తెస్తా!" సూర్యం తండ్రి అన్నాడు.

"కాస్సేపు ఆ టి.వి. చూస్తూ కూచోండి!" అని తండ్రీ కొడుకులకి చెప్పి "సార్! కాసేపు లోపలకొస్తారా!" అని బంగారయ్య ఆఫీసర్‌గార్ని లోపలికి తీసుకెళ్ళాడు.

"అయ్యా... పొలం అమ్మేస్తానని చెబుతున్నాడు. ఆ బంగారం ఇంకా అమ్మలేదు. కాబట్టి ఆ పొలం బంగారం మనమే ఉంచేసుకుంటేపోతుంది కదా! ఆ పదిహేను వేలూ మునసబుకిచ్చేసి పొలం మన పేర్న రిజిష్టర్ చేయిస్తే సరిపోతుంది. బంగారం ఏం చేసుకుందాం!" బంగారయ్య కంప్యూటర్ల కందనంత వేగంగా ఆలోచించి అన్నాడు.

"బాగానే ఉందయ్యా.... కానీ, వాటాలు ఎలా తెగుతాయి" సంకోచంగా అన్నాడు ఆఫీసర్ గారు.

"దాందేముందిసార్! 50 సెంట్లు అపాయింట్ చేసే అయ్యగారికి, 25 సెంట్లు తమరికి, కష్టపడి బేరం తెచ్చినందుకు ఓ పాతిక సెంట్లు నాకు, రిజిష్టర్ చేయించమందాం. పండిన ధాన్యం బియ్యం ఆడించి పంపమందాం! బియ్యం కొనే అవసరం ఉండదు. పాపం! అతని పొలాన్ని వేరొకళ్ళు చెయ్యడం చూస్తే బాధ పడతాడు కదా! అతన్నే చెయ్యమంటాం!" అన్నాడు బంగారయ్య.

"భేష్! బాగుందయ్యా" సంతృప్తిగా తలూపాడు ఆఫీసర్!

★ ★ ★

అనుకున్న ప్రకారం సూర్యానికి ఉద్యోగం వచ్చింది. సూర్యం తండ్రి క్రమం తప్పకుండా బియ్యం చేర వేస్తున్నాడు. పనిలో ఉన్న కొడుకుని ఓమారు చూద్దామనిపించింది. బంగారయ్యని అడ్రసు అడిగి తెలుకుని అక్కడికెళ్ళాడు.

సూర్యం పలుగూ, పారా పట్టుకుని మొక్కలకి పాదులు చేస్తూ నీళ్ళు పెడుతున్నాడు. తండ్రికి మతిపోయింది. కొడుకు చేస్తున్న ఉద్యోగం ఇదా! కాసేపు అతని హృదయం మూగగా రోదించింది. కొడుకు చేసేది తోటమాలి పని.

"బాబూ... ఇది మన వృత్తే! దీనిని ఉద్యోగం అనే పేరుతో ఇంత దూరం వచ్చి చేయాల్సిన పనిలేదు. ఈ పని మనూళ్ళోనే ఉంది పదా!" అని ఆఫీసర్‌గారింటికొచ్చి "అయ్యా! తమరి పొలాన్ని తమఁరే సేసుకుంటారో, ఎవరిచేతన్నా చేయించుకుంటారో మీ ఇష్టం. నానుసెయ్యను" అని చెప్పి, భుజం మీది తువ్వాలు దులిపి, చంకలో పెట్టుకున్నాడు. జీపులు రేవే ధూళికి అలవాటుపడ్డ అతని నాసికాపుటలకి, చెమటతో తడిసిన ఆ తవ్వాలు ధూళి చేరలేదు.

తండ్రీ కొడుకులు ఊళ్ళో కొస్తున్నారు. మునసబు గారింట్లో పెళ్ళి జరుగుతోంది. మైకులోంచి పాట వస్తోంది "చిన్ని చిన్ని ఆశ" ....... పల్లెలోనూ, పట్నంలోనూ అదే ఆశ, అదేపాట. ఒకటి బ్రతుకు తెరువుకైతే, మరొకటి ఇతరుల బ్రతుకుల్ని భారంగా తయారుచేసేది.

తండ్రీ కొడుకులు నడుస్తున్నారు. సాయంత్రం వెలుగులో వారి నీడలు చిత్రంగా కదుల్తున్నాయి. సూర్యుడు అస్తమిస్తున్నాడు. శక్తివంతమైన రేపటికి వెలుగులు అందించాలని.

●